సాక్షి
కామారెడ్డి

శనివారం । 26 । జూలై । 2025



జాగ్రత్తలు పాటించాలి

వర్షాలు కురుస్తున్నందున వాగులు, చెరువుల వద్ద ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ రాజేశ్ చంద్ర సూచించారు.

- 8లో ▸



స్కూల్ వ్యాన్ బోల్తా

జిల్లాకేంద్రానికి సమీపంలో ఓ స్కూల్ వ్యాన్ బోల్తాపడిన ఘటనలో ఆరుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
29.5 /21.7

వాతావరణం

ఉదయం శీతల గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

కామారెడ్డి క్రైం: జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎక్కడైనా అత్యవసర పరిస్థితులు ఏర్పడితే ప్రజలకు సహకారం అందించడం, ఫిర్యాదులు స్వీకరించడం కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. అత్యవసర సమయాల్లో 08468 -220069 నంబర్‌కు ఫోన్‌చేయాలని, ఇది 24 గంటల పాటు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

'ఈ-పాస్ ద్వారానే ఎరువులు విక్రయించాలి'



బిచ్కుంద: ఎరువులను ఈ-పాస్ ద్వారానే విక్రయించాలని జిల్లా సహకార అధికారి రామ్మోహన్ ఆదేశించారు. శుక్రవారం ఆయన బిచ్కుంద సొసైటీని సందర్శించి రికార్డులు, ఎరువుల గోదాంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని సొసైటీలలో ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎక్కడా కొరత లేదన్నారు. ఎరువులు ఎక్కువగా వాడితే భూసారం దెబ్బతిని దిగుబడులూ తగ్గుతాయన్నారు. రైతులు రసాయనిక ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులు వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బాలాజీ, అధికారులు లక్ష్మీనారాయణ, అలీం, సంఘం కార్యదర్శి శ్రావణ్ పాల్గొన్నారు.

ట్రయథ్లాన్ ఎంపిక పోటీలు వాయిదా

కామారెడ్డి అర్బన్: జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో శనివారం నిర్వహించాల్సిన జిల్లా స్థాయి ట్రయథ్లాన్ ఎంపిక పోటీలను వాయిదా వేశారు. వర్షాల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి పోటీలు ఎప్పుడు నిర్వహించేది తర్వాత ప్రకటిస్తామని పేర్కొన్నారు.

పెరుగుతున్న పోచారం నీటిమట్టం

నాగిరెడ్డిపేట: ఎగువ ప్రాంతాల్లో మూడురోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పోచారం ప్రాజెక్టు నీటిమట్టం పెరుగుతోంది. లింగంపేట, గుండారం వాగుల ద్వారా ప్రాజెక్టులోకి శుక్రవారం 958 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 21.5 అడుగులు (1.820 టీఎంసీలు) కాగా శుక్రవారం సాయంత్రానికి 10.3 అడుగుల (0.523 టీఎంసీ) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

జిల్లా ప్రత్యేకాధికారిగా రాజీవ్‌గాంధీ హనుమంతు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు ప్రత్యేకాధికారిగా రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు నియమితులయ్యారు. గతంలో సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ శరత్ ప్రత్యేకాధికారిగా ఉన్నారు. ఆయన స్థానంలో రాజీవ్‌గాంధీ హనుమంతును నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

'ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి'



తాడ్వాయి: రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి సూచించారు. తాడ్వాయి రైతు వేదిక కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. రైతులు ఏ సీజన్‌లో ఏ పంటలు వేయాలో వివరించారు. అవసరం మేరకే ఎరువులను వాడాలని సూచించారు. వర్షాలు తగ్గిన అనంతరం పంటలకు యూరియా వేయాలన్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు పాటించాలని సూచించారు. అనంతరం రైతువేదిక ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఏడీఏలు భారతి, లక్ష్మీప్రసన్న, సుధామాధురి, ఏవోలు నర్సింలు, సంతోష్ కుమార్, సునీతరాణి, తబుస్సుమ్, ఏఈవోలు శ్రావణ్‌కుమార్, అశోక్, రమ్య, హారిక, సతీష్, శివచైతన్య, రైతులు పాల్గొన్నారు.

స్థానికంలో మనదే గెలుపు

- అన్ని వర్గాలను మోసం చేస్తున్న కాంగ్రెస్
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- లింగంపేటలో ఆత్మగౌరవ గర్జన సభ
- సభ సక్సెస్‌తో పార్టీ శ్రేణుల్లో జోష్



మాట్లాడుతున్న కేటీఆర్, పక్కన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జాజాల, సింధే, గంప, బాజిరెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి/లింగంపేట : ''కాంగ్రెస్ అన్ని వర్గాలను మోసం చేసింది. పాలిచ్చే బర్రెను వదిలేసి తన్నే దున్నపోతును తెచ్చుకున్నమని ప్రజలు బాధపడుతుండ్రు. ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రజల్లోకి తీసుకువెళితే 'స్థానిక' ఎన్నికల్లో మనదే విజయం'' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. లింగంపేట అంబేడ్కర్ చౌక్‌లో నిర్వహించిన ఆత్మగౌరవ గర్జన సభలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ జయంతి రోజున స్థానిక దళిత నాయకుడు సాయిలును ప్రభుత్వ ఆదేశాలతో పోలీసులు అవమానించారంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్లారెడ్డి అభివృద్ధి ప్రదాతగా చెప్పుకుంటున్న స్థానిక ఎమ్మెల్యే అమెరికా నుంచి ఏమైనా నిధులు తీసుకువచ్చిండా అని ప్రజలను ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలు మోసపోయాయని, అందరూ కసితో ఉన్నారని ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రస్తావిస్తూ వాటిని అమలు చేయకుండా ఎలా మోసం చేస్తుందో వివరించారు. దొడ్డు వడ్లకు బోనస్ ఇవ్వకుండా తప్పించుకున్న సర్కారు.. ఇప్పుడు సన్న వడ్లకూ ఇవ్వడం లేదని విమర్శించారు. కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పులపాలు జేసిండని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని, తమ ప్రభుత్వ హయాంలో కరోనాలాంటి సమయంలో కూడా సంక్షేమ పథకాలు ఏ ఒక్కటీ ఆగలేదని పేర్కొన్నారు. పాలించడం చేతగాక ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. 22 లక్షల మంది కౌలు రైతులకు రైతుబంధు ఇస్తానని చెప్పి వాళ్లను కూడా మోసం చేశారన్నారు. కేసీఆర్ 1,022 గురుకులాలు ఏర్పాటు చేసి, 6.50 లక్షల మంది విద్యార్థులకు సన్నబువ్వ పెట్టి, నాణ్యమైన చదువు చెప్పిస్తే.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాత్రం విద్యార్థుల ప్రాణాలు బలితీసుకుంటోందని ఆరోపించారు.

వర్షంలోనూ కొనసాగిన సభ

ఆత్మగౌరవ గర్జన సభ వర్షంలోనే కొనసాగింది. సభ ప్రారంభం నుంచి ముగిసేదాకా చినుకులు పడుతూనే ఉన్నాయి. వర్షంతో కేటీఆర్‌తో పాటు నేతలంతా తడిసిపోయారు. జనం అందరూ నేతల ప్రసంగాలను ఆసక్తిగా విన్నారు. సభ సక్సెస్ కావడంతో పార్టీ శ్రేణుల్లో జోష్ కనిపించింది.



సభలో ఉత్సాహంగా నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

సాయిలు ఇంట్లో భోజనం..



సాయిలు ఇంట్లో భోజనం చేస్తున్న కేటీఆర్

లింగంపేటకు చెందిన దళిత నాయకుడు, మాజీ ఎంపీపీ ముదాం సాయిలు ఇంటికి వెళ్లిన కేటీఆర్.. ఆయనతోపాటు దేశపతి శ్రీనివాస్, జాజాల సురేందర్‌లతో కలిసి భోజనం చేశారు. తర్వాత ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేటకు వెళ్లి పార్టీ నేతలను కలిశారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తిరిగి వెళ్లారు.

దళితులకు ఆర్థిక స్వావలంబన రావాలి

లింగంపేట: దళితులు ఆర్థిక స్వావలంబన సాధించాలని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. అంబేడ్కర్‌ను స్మరిస్తే సమసమాజం ఏర్పడుతుందన్నారు. ఇంగ్లాండ్ ఆయనను గౌరవించిందని, భారతదేశం ఆయనను అవమానిస్తుందని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి మాట్లాడితే నిలువెత్తు అహంకారం, మాటనిండా వెటకారం, భాష అంతా వికారం, తెలంగాణకు అపకారం అని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి మాట్లాడితే అబద్ధాలు, బూతులు తప్ప ఏమీ ఉండదన్నారు. బనకచర్ల మీటింగుకు పోనేపోనన్న రేవంత్‌రెడ్డి.. చంద్రబాబు ఫోన్ రాగానే వెళ్లి సంతకం పెట్టి వచ్చాడన్నారు. సినిమా టికెట్ల రేటు పెంచనన్న సీఎం.. హరిహర వీర మల్లుకు ఎలా అవకాశం ఇచ్చారని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి దోపిడీకి అడ్డు వస్తున్నారని కేసులు నమోదు చేస్తున్నారన్నారు. నిప్పులు చిమ్మే తుపాకీ రవ్వలం.. గుప్పిట పట్టి నలిపేస్తాం అంటూ పాట పాడి అందరినీ చైతన్య పర్చారు.

బట్టలూడదీసి జైళ్లో వేస్తున్నరు..

కాంగ్రెస్ పాలనలో దళితుల బట్టలూడదీసి జైల్లో పెడుతున్నారని ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. ఎర్ర బస్సు ఎక్కలేని దళితులు, గిరిజనులు, బీసీలను ఎయిర్‌బస్ ఎక్కించిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని నాగన్నగారి బావిలో పడేయాలన్నారు.

కాంగ్రెస్‌ను మట్టికరిపించాలి

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని మట్టికరిపించాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అంబేడ్కర్ సాక్షి గా అవమానం జరిగిన చోటే సాయిలుకు సన్మానం చేయాలని కేటీఆర్ లింగంపేటకు వచ్చారన్నారు. బీఆర్‌ఎస్ నాయకులను అవమాన పరిచిన వారిని వదిలిపెట్టబోమన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రమేశ్, నాయకులు సాయిలు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఘన స్వాగతం..



కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న గంప గోవర్ధన్, నాయకులు, కార్యకర్తలు

కామారెడ్డి క్రైం: కేటీఆర్ శుక్రవారం హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గాన కామారెడ్డికి వచ్చారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని నర్సన్నపల్లి వద్ద మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, పార్టీ నేతలు స్వాగతం పలికారు. అనంతరం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కేటీఆర్ కొద్దిసేపు ఆగారు. పార్టీ వ్యవహారాలు, జిల్లాలో రాజకీయ పరిస్థితులపై సమీక్షించారు. అనంతరం లింగంపేటకు వెళ్లారు.

నాగిరెడ్డిపేటలో..



నాగిరెడ్డిపేటలో సీనియర్ నాయకుడు ప్రతాప్‌రెడ్డితో మాట్లాడుతున్న కేటీఆర్

నాగిరెడ్డిపేట: మాజీమంత్రి కేటీఆర్ నాగిరెడ్డిపేట మండల సీనియర్ నాయకుడు ప్రతాప్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనను ప్రతాప్‌రెడ్డితోపాటు ఇతర నాయకులు సన్మానించారు. కేటీఆర్ వెంట మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సురేందర్, గంప గోవర్ధన్, హన్మంత్ సింధే, బాజిరెడ్డి, జనార్దన్‌గౌడ్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదర్ రాజు తదితరులున్నారు.

రంగులు వేసి, ఫొటోలు దిగుతుండు



మాట్లాడుతున్న సురేందర్

గతంలో తన హయాంలో చేసిన అభివృద్ధి పనులకే ప్రస్తుత ఎమ్మెల్యే రంగులు వేసుకొని ఫొటోలు దిగుతూ గొప్పలు చెప్పుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ విమర్శించారు. ఎల్లారెడ్డి బస్టాండ్, సీసీ రోడ్లు, లింగంపేట మత్తడి పోచమ్మ రోడ్డు, ఎల్లారెడ్డి మినీ ట్యాంక్ బండ్, లింగంపేట బస్టాండ్ తన హయాంలోనివేనన్నారు. వాటికి ప్రస్తుత ఎమ్మెల్యే రంగులు వేసి తాను కట్టించినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ''ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును కలవాలంటే క్యూఆర్ కోడ్ పెట్టుకొని పోవాలంట, క్యూఆర్ కోడ్ అంటే ఎంత మందికి తెలుస్తుంది. ఈ ఎమ్మెల్యేను ప్రజల కోసం ఎన్నుకున్నామా, ఆయనకు గులాముగా ఉండడానికి ఎన్నుకున్నామా'' అని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాతలు పెట్టాలని కోరారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు దళిత వ్యతిరేకి అన్నారు. అందుకే ఎక్కడా ఫ్లెక్సీల్లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఫొటోలు పెట్టడంలేదన్నారు.

దరఖాస్తులు పరిష్కరిస్తున్నాం



మద్నూర్‌లో పట్టా అందిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

- బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి

మద్నూర్: రెవెన్యూ సదస్సులలో రైతులు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి, క్రమంగా పరిష్కారం చూపుతున్నామని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి పేర్కొన్నారు. స్థానిక తహసీల్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ సదస్సులలో దరఖాస్తు చేసుకున్న వారి సమస్యలకు పరిష్కారం చూపారు. మండలంలోని సోమూర్ గ్రామానికి చెందిన హన్మంత్‌వార్ శివానంద, ఎబిత్వార్ పూలలకు భూ భారతి రెవెన్యూ పట్టా హక్కు పత్రాలను అందించారు. పట్టా హక్కులు పొందిన వారికి సబ్ కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముజీబ్, ఆర్ఐ శంకర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కేజీబీవీలో కూరగాయలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

నాణ్యమైన భోజనం అందించాలి

విద్యార్థినులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి ఆదేశించారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. కూరగాయలను, తరగతి గదులు, హాస్టల్‌ను పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

14 లోగా భూ సమస్యలను పరిష్కరించాలి



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

- టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: భూ భారతి రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన దరఖాస్తులను వచ్చేనెల 14వ తేదీలోగా వంద శాతం పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన జిల్లాలోని రెవెన్యూ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. లావని పట్టా భూముల సమస్యల వివరాలను ఈనెల 28 లోగా కలెక్టరేట్‌లో సమర్పించాలన్నారు. రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన అన్ని రకాల దరఖాస్తులకు నోటీసులు జారీ చేయాలన్నారు. పీవోటి, లావని పట్టా దరఖాస్తుదారులు అర్హులా కాదా అనే అంశంపై విచారణ చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో 36,817 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో 36,703 దరఖాస్తులను ఇప్పటివరకు ఆన్‌లైన్ చేశామని పేర్కొన్నారు.

19,759 దరఖాస్తులకు సంబంధించి నోటీసులు జారీ చేశామని, ఇందులో 9,753 దరఖాస్తులను పరిష్కరించామని తెలిపారు. మిగతా వాటిని వేగంగా పరిష్కరించాలని డివిజన్, మండలాల అధికారులను ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ విక్టర్, సబ్ కలెక్టర్ బాన్సువాడ కిరణ్మయి, ఆర్డీవోలు వీణ, పార్థసింహారెడ్డి, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

బ్రిడ్జి పనులను వేగవంతం చేయండి



గంగమ్మ వాగుపై బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

రామారెడ్డి: మండల కేంద్ర శివారులోని గంగమ్మ వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం బ్రిడ్జి పనులను పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. అనంతరం ఆయన రామారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలించారు. రోగులతో మాట్లాడి ఆస్పత్రిలో అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున వైద్యులు, వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వైద్యాధికారి సురేశ్ ఆస్పత్రిలో అందుబాటులో ఉండడం లేదని పలువురు కలెక్టర్‌తో పేర్కొన్నారు. ఆయనకు షోకాజ్ నోటీస్ ఇవ్వాలని డీఎంహెచ్‌వోను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం రామారెడ్డిలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభు కిరణ్ తదితరులున్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

- ఏబీవీపీ నాయకుల డిమాండ్
- జిల్లా కేంద్రంలో ర్యాలీ, రాస్తారోకో

కామారెడ్డి టౌన్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని ఏబీవీపీ ఇందూర్ విభాగ్ కన్వీనర్ శశిధర్ డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో శుక్రవారం విద్యార్థులు రోడ్డెక్కారు. జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ నుంచి నిజాంసాగర్ చౌరస్తా వరకు ర్యాలీ తీసి, రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా శశిధర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ. 8,300 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పవన్ దత్త, సంజయ్, అల్తాఫ్, ఖాజా, శ్రీకాంత్, విఘ్నేష్, నితిన్, హర్షిత్ కృష్ణ, రవికాంత్, అక్షయ్, అజార్, యోగేష్, శ్రావణి, కావ్య, సాత్విక, సంజన తదితరులు పాల్గొన్నారు.



నిజాంసాగర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

చెరువుకు వెళ్లి.. జలమును తెచ్చి..

దోమకొండ: మండల కేంద్రంలోని శివరాంమందిర్‌లో శ్రావణమాస ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులు స్థానిక కుడి చెరువు వద్దకు వెళ్లి బిందెలతో నీటిని తెచ్చి స్వామివారిని అభిషేకించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు రామకృష్ణశర్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు కొండ అంజం, ప్రతినిధులు నగరం నర్సింలు, చింతల చిరంజీవి, చెన్నం స్వాతి, నాయిని లింగారెడ్డి, నాయకులు ఐరేని నర్సయ్య, నల్లపు అంజలి, ఆలయ ఈవో ప్రభు పాల్గొన్నారు.



కుడి చెరువు నుంచి నీటిని తీసుకువస్తున్న భక్తులు

క్లుప్తంగా

రోడ్డుపై విరిగి పడిన చెట్టు



మాచారెడ్డి: మాచారెడ్డి, పాల్వంచ మండలాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. మాచారెడ్డి–సిద్దిపేట రహదారిపై చెట్టు విరిగిపడటంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న మాచారెడ్డి ఎస్సై అనిల్ జేసీబీ సాయంతో చెట్టును తొలగించారు.

బాధితురాలికి న్యాయం చేయాలి



బాన్సువాడ: ఓ వ్యక్తి చేతిలో మోసపోయిన బాధితురాలికి న్యాయం చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బాన్సువాడలో గురువారం వారు మాట్లాడుతూ.. బీర్కూర్ గ్రామానికి చెందిన నర్ర సాయిలు అనే వ్యక్తి ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి 16 ఏళ్లు సహజీవనం చేశాడన్నారు. వీరికి బాబు జన్మించగా, ప్రస్తుతం ఆమెతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన మోసం చేశాడన్నారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. దళిత సంఘాల నేతలు మల్లూరి సాయిలు, భూమన్న, సురేష్, నక్క విజయ్, గున్న సాయిలు, బాధితురాలు జ్యోతి తదితరులు ఉన్నారు.

మాజీ ఎంపీపీ మృతి



పిప్పిరి ఆంజనేయులు(ఫైల్)

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మండల మాజీ ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు(65) శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. ఆయన కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా, సీనియర్ నాయకుడిగా సేవలు చేశారు. మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, సీనియర్ నాయకులు ఆయన మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అంత్యక్రియలు శనివారం జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఉద్యానం..ఉత్తదేనా..?

- ఉద్యాన శాఖలో వేధిస్తున్న ఖాళీలు
- జిల్లాలో ఏడు హెచ్‌వో పోస్టులు
- ప్రస్తుతం ఉన్నది ఇద్దరే
- చాలా రోజులుగా పోస్టులు ఖాళీ
- రైతులకు ఉద్యానసేవలు అందడంలో జాప్యం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జిల్లా ఉద్యాన శాఖలో కొంతకాలంగా నెలకొన్న హెచ్‌వో(హార్టికల్చర్ అధికారి)ల ఖాళీలు రైతులను వేధిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఏడుగురు హెచ్‌వోలు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఇద్దరు హెచ్‌వోలు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఫలితంగా ఏడుగురు చేయాల్సిన పనిని ఇద్దరు హెచ్‌వోలు మాత్రమే నిర్వర్తిస్తున్నారు. జిల్లాలో కామారెడ్డి, బాన్స్‌వాడ, జుక్కల్ నియోజకవర్గాలకు ఒక్కో హెచ్‌వో చొప్పున, ఎల్లారెడ్డి నియోజకవర్గానికి ఇద్దరు హెచ్‌వోల చొప్పున ఉండాలి. దీంతో పాటు ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద ఉద్యానక్షేత్రానికి ప్రత్యేకంగా మరో హెచ్‌వో, జిల్లాకేంద్రంలోని ఉద్యానశాఖ కార్యాలయంలో టెక్నికల్ విభాగానికి ఒక హెచ్‌వో ఉండాల్సి ఉంది. కానీ కొంతకాలంగా ఇద్దరు హెచ్‌వోలు మాత్రమే ఏడుగురు హెచ్‌వోల బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఫలితంగా రైతులకు సకాలంలో ఉద్యానశాఖ సేవలు అందడంలేదు.

లక్ష్యం నెరవేర్చడంలో ఇబ్బందులు..

ఉద్యానశాఖ ద్వారా జిల్లాలో అమలుచేస్తున్న వివిధ పథకాల లక్ష్యం నెరవేర్చడంలో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జిల్లాలో ఉద్యానశాఖ ద్వారా అమలుచేస్తున్న ఎంఐడీహెచ్, ఆర్‌కేవీవై పథకాలతోపాటు డ్రిప్, స్ప్రింక్లర్స్, ఆయిల్ పాం తోటల ఏర్పాటులో జాప్యం జరుగుతోంది. ఉద్యానశాఖలోని హెచ్‌వోల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని రైతులు కోరుతున్నారు.

కామారెడ్డి తహసీల్‌లో కనిపించని అధికారులు

- తహసీల్దార్ లేకుంటే సిబ్బంది ఖాళీ
- గత కొన్ని నెలలుగా ఇదే తంతు



స్లాట్ బుక్ చేసినా భూమి రిజిస్ట్రేషన్ కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న లింగాపూర్ గ్రామస్తులు

కామారెడ్డి అర్బన్: జిల్లా కేంద్రమైన కామారెడ్డి పట్టణ జనాభా లక్షకు పైగా ఉండడం, కామారెడ్డి మండల, గ్రామాలకు కలిపి ఒకే తహసీల్ కార్యాలయం సేవలు అందించాల్సి ఉండగా అసలు సిబ్బందే కుర్చీల్లో కనిపించడం లేదు. మండలంలోని గ్రామాల్లో రెవెన్యూ సభలుంటే తహసీల్ ఆఫీసుల్లో అటెండర్ తప్ప ఏ ఉద్యోగి ఉండటం లేదు. శుక్రవారం భూమి రిజిస్ట్రేషన్ కోసమని లింగాపూర్‌కు చెందిన పిల్లమారి రామవ్వ, అవుసుల బ్రహ్మంలతో పాటు పలువురు స్లాట్ బుక్ చేసుకున్నారు. ఉదయం 10.30కు స్లాట్ బుక్ కాగా అమ్మకం, కొనుగోలు దారులు, వారి బంధువులు, సాక్షులు తహసీల్ ఆఫీసుకు చేరుకోగా అక్కడి సిబ్బంది లేకపోవడంతో ఆశ్చర్యపోయారు. మధ్యాహ్నం ఒంటి గంట అవుతున్నా ఆఫీసులో ఎవరూ లేకపోవడంతో లింగాపూర్ చెందిన బ్రహ్మం ఆగ్రహం వ్యక్తం చేశారు. కంప్యూటర్ గది నుంచి వచ్చిన ఓ కాంట్రాక్ట్ సిబ్బంది ధరణి సిబ్బందికి జీతాలు రానందున కలెక్టర్ ఆఫీసుకు వెళ్లారని, తహసీల్దార్ సైతం అక్కడికే వెళ్లారని బదులిచ్చారు. మరి స్లాట్ సంగతి అంటే తనకు తెలియదన్నారు. ఇలా తహసీల్ ఆఫీసులో ప్రతి నిత్యం ఇలా బాధ్యత లేకుండా సిబ్బంది పనిచేస్తున్నారని అక్కడికి వచ్చిన పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. తాను రేషన్ కార్డు విషయమై వారం రోజుల నుంచి తిరుగుతున్న సరైన సమాధానం చెప్పేవారు లేరని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయమై వివరణ కోరేందుకు తహసీల్దార్ జనార్దన్‌కు ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో సంతోష్ కుమార్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు తిర్మన్‌పల్లి, మర్కల్, ధర్మారావ్‌పేట్, అమర్లబండ తదితర గ్రామాల్లో పరిసరాలను పరిశీలించారు. వర్షాకాలంలో ఇంటి పరిసరాల్లో నీరు నిలువ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యదర్శులు ప్రశాంత్, జిల్లాల స్రవంతి, ఎండీ ఇమ్యాజుద్దిన్, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిరూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ మహేష్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 8,9వ వార్డులలో మురికి నీటి కాలువలలో దోమలు వృద్ధి చెందకుండా పిచికారీ చేయించారు. నీరు నిలువ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు.

రాజంపేట: మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో ఎంపీడీవో బాలకృష్ణ పాల్గొన్నారు. ప్రధాన వీధులను పరిశీలించి పలు సూచనలిచ్చారు. అధికారిణి అపర్ణ, ఎంపీవో రఘురాం, కార్యదర్శిఅశోక్,తదితరులు పాల్గొన్నారు.



మర్కల్‌లో పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపీవో సురేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్రవంతి

వసతి గృహాల్లో దోమల మందు పిచికారి

బాన్సువాడ : బాన్సువాడ పట్టణంలోని వివిధ వసతి గృహాల్లో శుక్రవారం దోమల మందును మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు పిచికారీ చేయించారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది సతీష్, హన్మండ్లు, వార్డెన్లు విజయ భారతి, గంగాసుధ తదితరులున్నారు.



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో, ఎంపీడీవో

హన్మాజీపేట్‌లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు

బాన్సువాడ రూరల్: హన్మాజీపేట్‌లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులను బాన్సువాడ డీఎల్‌పీవో సత్యనారాయణరెడ్డి, ఎంపీడీవో ఆనంద్‌లు పరిశీలించారు. గ్రామంలో దోమలు వృద్ధి చెందకుండా దోమల నివారణ మందు పిచికారి చేయించారు. అలాగే డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి డంపింగ్‌యార్డులకు తరలించారు. తాగునీటి పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మత్తులు చేయించారు.

ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

- జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర



గాంధారి మండలంలోని పెద్ద గుజ్జుల్ తండా వద్ద వాగును పరిశీలిస్తున్న ఎస్పీ రాజేష్ చంద్ర

గాంధారి: వాగులు, చెరువుల వద్ద ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ రాజేష్ చంద్ర సూచించారు. గాంధారి మండలంలోని పెద్ద గుజ్జుల్ తండా, సర్వాపూర్ వద్ద నున్న వాగులను పరిశీలించారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు వాగులు, వంతెనలు దాటి ప్రయాణించడం, సెల్ఫీలు దిగేందుకు యత్నించడం మంచిది కాదన్నారు. ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. ఎస్సై ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించాలి

బాన్సువాడ: ఆన్‌లైన్ మోసాలు, బెట్టింగ్ యాప్‌లపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. శుక్రవారం ఆయన బాన్సువాడ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ముందుగా సిబ్బందితో మాట్లాడారు. రోల్‌కాల్‌ను పరిశీలించి, హాజరు, గైర్హాజరు సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరు అన్ని రకాల విధులను తెలుసుకుని ఉండాలని, మారుతున్న సమాజానికి అనుగుణంగా ఎలాంటి విధులనైనా చేయగలిగే విధంగా కంప్యూటర్ పరిజ్ఞానాన్ని ఆధునిక సాంకేతికతను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. నేరాల నివారణకు, ఛేదనకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని, ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన అన్నారు.

ఆస్తి సంబంధిత నేరాలను అరికట్టాలి

ఆస్తి సంబంధిత నేరాలను అరికట్టాలని ఎస్పీ అన్నారు. శుక్రవారం బాన్సువాడ పోలీస్ స్టేషన్‌లో డివిజన్ పరిధిలోని డీఎస్పీ, సీఐలతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఆస్తి నేరాలను నియంత్రణ చేయడంలో సవాళ్లను పరిశీలిస్తూ నేరాల నివారణ కోసం సలహాలు, సూచనలు ఇచ్చారు. భారీ వర్షాల నేపథ్యంలో పట్టణంలో మినీ ట్యాంకు బండ్, మంజీర చెక్ డ్యాం పరిసరాలను ఎస్పీ పరిశీలించారు. డీఎస్పీ విఠల్‌రెడ్డి, సీఐలు, ఎస్సైలు ఉన్నారు.

బాధితులకు అండగా భరోసా కేంద్రం

- సీపీ సాయిచైతన్య

ఖలీల్‌వాడి: బాధిత మహిళలు, పిల్లలకు సహాయం అందించడంతోపాటు మెరుగైన సేవలు అందిస్తూ భరోసా కేంద్రం అండగా నిలుస్తోందని సీపీ సాయిచైతన్య పేర్కొన్నా రు. జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయం వద్ద ఉన్న భరోసా కేంద్రంలో నమోదైన పోక్సో, రేప్ కేసులలోని ఏడుగురు బాధిత పిల్లలు, మహిళలకు భరోసా కేంద్రం తరఫున చెక్కులను శుక్రవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ భరోసా కేంద్రం ద్వారా మహిళలకు మనోధైర్యం, న్యాయం అందించడం పోలీస్ శాఖ ముఖ్య లక్ష్యాలలో ఒకటన్నారు. కార్యక్రమంలో డీసీపీ(అడ్మిన్) బస్వారెడ్డి, భరోసా సెంటర్ కో–ఆర్డినేటర్ జీ రోజా, లీగల్ అడ్వయిజర్ దయాణ గీతిక, మహిళా పీఎస్ ఎస్సై పుష్పావతి, మౌనిక, సవిత తదితరులు పాల్గొన్నారు.



రెడిమిక్స్ ప్లాంట్‌లో చోరీ

భిక్కనూరు: మండలంలోని అంతంపల్లి గ్రామశివారులోగల రెడిమిక్స్ ప్లాంట్‌లో గుర్తుతెలియని వ్యక్తులు ఇనుప సామగ్రిని చోరీ చేశారు. భిక్కనూరు టోల్‌ప్లాజా శాశ్వత నిర్మాణం కోసం అంతంపల్లి గ్రామశివారులో రెడిమిక్స్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. శుక్రవారం వేకువజామున గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు ఆటోలో వచ్చి, సెంట్రింగ్‌కు అవసరమైన సామగ్రిని ఎత్తుకెళ్లేందుకు యత్నించారు. వెంటనే అక్కడ విధులు నిర్వహిస్తున్న నవీన్, చందమాలలు అప్రమత్తమవగా, వారిపై దుండగులు దాడి చేసి ఆటోలో ఇనుప సామగ్రిని ఎత్తుకెళ్లారు. ఈ విషయమై ఎస్సై ఆంజనేయులు ఘటన స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసుకున్నారు.

బోల్తాపడిన స్కూల్ వాహనం

- ఆరుగురు విద్యార్థులకు గాయాలు



పల్టీ కొట్టిన వాహనం



ఆస్పత్రిలో విద్యార్థులతో వారి తల్లిదండ్రులు

కామారెడ్డి క్రైం: ఓ స్కూల్ వ్యాన్ బోల్తా పడి, ఆరుగురు విద్యార్థులకు గాయాలైన ఘటన జిల్లా కేంద్రానికి సమీపంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. పట్టణ శివారులో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన తూఫాన్ వాహనం సాయంత్రం 5గంటల ప్రాంతంలో విద్యార్థులను ఎక్కించుకొని స్కూల్ నుంచి బయలుదేరింది. కొద్దిసేపటికే ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఘటన సమయంలో వాహనంలో 15 మంది విద్యార్థులు ఉండగా, వారిలో ఆరుగురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి.గాయపడిన వారిని వెంటనే పట్టణంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించి, చికిత్స అందించారు. వాహనం అదుపుతప్పి పడినట్లు భావిస్తున్నారు. పట్టణ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు సాధారణ బదిలీలు చేయాలి

కామారెడ్డి టౌన్: సమగ్ర శిక్షలో ఏళ్లతరబడి ఒకే చోట పని చేస్తున్న ఉద్యోగులకు సాధారణ బదిలీలు చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమగ్రశిక్ష లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు ఇటీవల ప్రభుత్వం కల్పించిన మ్యూచువల్, స్పౌజ్ బదిలీలో ఉద్యోగులకు పెద్దగా ఉపయోగం లేదన్నారు. ప్రభుత్వం సమ్మె కాలంలో ఇచ్చిన హామీ ప్రకారం సాధారణ బదిలీలు చేయాలని కోరారు. జిల్లా స్థాయిలో, కేజీబీవీ, యూఆర్ఎస్, మండల స్థాయిలో పని చేసే ఎంఐఎస్ కో–ఆర్డినేటర్, కంప్యూటర్ ఆపరేటర్, ఐఈఆర్పీ క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్, పాఠశాల స్థాయి పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్స్‌లు 15 ఏళ్ల నుంచి ఒకే చోట పని చేస్తున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం సాధారణ బదిలీలు చేపడితే రాష్ట్రంలో పని చేస్తున్న దాదాపు 10 వేల మంది ఉద్యోగులకు లాభం చేకూరుతుందని అన్నారు.

గడువు పొడిగించాలి

కామారెడ్డి అర్బన్: కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలు, సమగ్ర శిక్షలో కాంట్రాక్ట్ ఉద్యోగుల దంపతులు(స్పౌజ్), పరస్పర (మ్యూచువల్) కేటగిరీలో బదిలీలకు ఈనెల 26 వరకు ఇచ్చిన గడువును పొడిగించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆకుల బాబు, ఏ.సాయిలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇటీవల పలు కేజీబీవీలు అప్‌గ్రేడ్ కావడం, కొందరు ఇతర ఉద్యోగాలకు వెళ్లడంతో ఖాళీలు ఏర్పడినందున ఆయా పోస్టుల్లో సాధారణ ఉద్యోగులకు బదిలీ అవకాశం కల్పించాలని వారు కోరారు.

క్రైం కార్నర్

సెక్యూరిటీ గార్డ్‌పై దాడి



మాక్లూర్: మండలంలోని మాణిక్‌భండార్ మార్కెట్ కమిటీ చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డ్ బట్టు నరేష్‌పై గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. బాధితుడు వారి నుంచి తప్పించుకొని పారిపోయి ప్రాణాలు కాపాడుకున్నట్లు శుక్రవారం తెలిపారు. ఈవిషయమై మాక్లూర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దాడి దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డవడంతో పోలీసులు వాటిని పరిశీలించారు. నిందితుల బైక్ నంబర్ సహాయంతో వారి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఇద్దరు నిందితులను పట్టుకునేందుకు పోలీసులు గాలిస్తున్నట్లు తెలిసింది.

ఇద్దరిపై కేసు నమోదు

రుద్రూర్: అదనపు కట్నం కోసం వేధించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు కోటగిరి ఎస్సై సునీల్ తెలిపారు. వివరాలు ఇలా.. కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం బరంగెడ్గి గ్రామానికి చెందిన రాజేష్‌తో కోటగిరి మండల కేంద్రానికి చెందిన రజితకు 19ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. ఇటీవల రజితను అదనపు కట్నం తెమ్మని భర్త రాజేష్, అత్త గంగమణి వేధించి, ఇంట్లో నుంచి పంపించివేశారు. దీంతో బాధితురాలు శుక్రవారం కోటగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మాణిక్‌భండార్‌లో గంజాయి కలకలం

మాక్లూర్: మండలంలోని మాణిక్‌భండార్ శివారులోగల పోచమ్మ ఆలయం సమీపంలో గంజాయి తాగుతున్న 9మంది యువకులను శుక్రవారం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు మాక్లూర్ పోలీసులు తెలిపారు. పట్టుబడిన వారంతా 20 ఏళ్లలోపు వయస్సు ఉన్న యువకులేనని తెలిపారు. గంజాయి ఎక్కడి నుంచి వచ్చింది. ఎవరి వద్ద కొనుగోలు చేశారు. ఎంతకాలంగా ఇలా గంజాయి తాగుతున్నారు అనేది విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మాక్లూర్: మండలంలోని గుత్ప గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగింది. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తి గురువారం తన ఇంటికి తాళం వేసి, మరో ఇంట్లో నిద్రించాడు. మరుసటి రోజు ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగలగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. మాక్లూర్ పోలీసులకు ఘటన స్థలానికి చేరుకొని క్లూస్‌టీంతో వేలిముద్రలు సేకరించుకొని వెళ్లారు. దుండగులు ఇంట్లోకి చొరబడి రెండు తులాల బంగారం చోరీ చేసినట్లు బాధితుడు తెలిపారు. ఈ విషయమై ఎస్సై రాజశేఖర్‌ను సంప్రదించే ప్రయత్నం చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు.

ఏర్గట్ల ఎస్సైపై సీపీకి ఫిర్యాదు

ఖలీల్‌వాడి: ఏర్గట్ల ఎస్సై, కానిస్టేబుళ్లపై శుక్రవారం బాధితుడు ఏర్గట్లకు చెందిన రాజ్ కుమార్ సీపీ సాయిచైతన్యకు ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా.. ఈ నెల 22న అర్ధరాత్రి ఏర్గట్ల మండల కేంద్రంలోని ఓ మంగలి దుకాణంలో షట్టర్ క్లోజ్ చేసి రాజ్‌కుమార్‌తోపాటు మరో ముగ్గురు మద్యం సేవిస్తున్నారు. అయితే ఎస్సై, ఇద్దరు కానిస్టేబుళ్లు వచ్చి నలుగురిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లారు. ముగ్గురిని వివరాలను అడిగి పంపారని, తనను వివరాలు అడిగితే నెలన్నర క్రితం గల్ఫ్ నుంచి వచ్చినట్లు తెలిపారు. అయితే ఎస్సై, కానిస్టేబుళ్లు పోలీస్ స్టేషన్ నుంచి వెళ్లడానికి డబ్బులు డిమాండ్ చేశారన్నారు. దీనికి ససేమిరా అనడంతో చితకబాదినట్లు చెప్పారు. దీనిపై సీపీకి ఫిర్యాదు చేసినట్లు అతడు పేర్కొన్నాడు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



సిరికొండ: మండలంలోని మైలారం గ్రామ శివారులో ఆయల కుంట చెరువు కట్ట పక్కన చెట్ల పొదలలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై రామకృష్ణ శుక్రవారం తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 35ఏళ్ల నుంచి 40ఏళ్ల మధ్య ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహన్ని ధర్పల్లి సీఐ భిక్షపతి, ఎస్సై పరిశీలించారు. మైలారం పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. గ్రామంలోని సీసీ ఫుటేజీని పోలీసులు పరిశీలించగా ఈ నెల 23న గ్రామంలో నుంచి ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మృతదేహంతో బైక్‌పై వెళుతున్నట్లు రికార్డయినట్లు తెలిసింది.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

రెంజల్(బోధన్): మండలంలోని సాటాపూర్ చౌరస్తాలో గురువారం సా యంత్రం పోలీసులు వాహనాల తనిఖీతోపాటు, డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఇద్దరు వ్యక్తులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వారిపై కేసు నమోదు చేసి, శుక్రవారం కోర్టులో హాజరుపర్చారు. జడ్జి ఇద్దరికి 4రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు.

మంచిప్పలో ఒకరి ఆత్మహత్య



పోశెట్టి (ఫైల్)

మోపాల్: మండలంలోని మంచిప్పలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సుస్మిత శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. మంచిప్పకు చెందిన ఆలకుంట పోశెట్టి (45) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నారు. దీంతో జీవితంపై విరక్తి చెంది అతడు గురువారం సాయంత్ర ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

దాడి కేసులో నిందితుడి రిమాండ్

నిజామాబాద్ రూరల్: ఒక వ్యక్తిపై దాడి చేసిన కేసులో షేక్ రెహన్ అనే వ్యక్తిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ పోలీసులు శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. నెహ్రూనగర్‌కు చెందిన షేక్ అఫ్సర్ అలీ ఈనెల 17న మండలంలోని రాంనగర్ గ్రామంలోని అతడి అక్క ఇంట్లో భోజనం చేస్తున్నాడు. ఈ సమయంలో రాంనగర్‌కు చెందిన షేక్ రెహన్ వ్యక్తిగత కక్షతో అతడి తలపై గాయపరిచాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి నిందితుడిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో వివరించారు.

బైక్ చోరీ కేసులో..

రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చంద్రశేఖర్ కాలనీకి చెందిన ఎస్‌కె మజీద్‌ను బైక్ చోరీ కేసులో పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరీఫ్ తెలిపారు. బైపాస్ రోడ్డుపై నిలిచి ఉన్న సుజుకి ఆక్సెస్ మోటార్ సైకిల్‌ను మజీద్ చోరీ చేయగా, ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. పోలీసులు నిందితుడిని గుర్తించి, రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

చిరుత సంచార ప్రాంతాల పరిశీలన



నందిగామ శివారులో చిరుత పాదముద్ర



చిరుత సంచారంపై విచారిస్తున్న అధికారులు

నవీపేట: మండలంలోని నందిగామ, సిరన్‌పల్లి గ్రామాలలో చిరుత సంచరిస్తున్నట్లు సమాచారం రావడంతో ఫారెస్ట్ అధికారులు శుక్రవారం ఆయా ప్రాంతాలను పరిశీలించారు. 15రోజుల కిందట నందిగామ శివారులో చిరుత కనిపించగా, కొందరూ ఫొటో తీశారు. కానీ అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వలేదు. అలాగే రెండు రోజుల కిందట సిరన్‌పల్లి శివారులో మేకల మందపై చిరుత దాడి చేసి ఒక మేకను తీవ్రంగా గాయపర్చింది. ఈ రెండు ఘటనలను కొందరు యువకులు శుక్రవారం సోషల్ మీడియాలో షేర్ చేశారు. దీంతో ఫారెస్ట్ నిజామాబాద్ బీట్ ఆఫీసర్ సుధీర్, సెక్షన్ ఆఫీసర్ జహ్రాలు స్పందించి, రెండు ప్రాంతాలను సందర్శించారు. పాదముద్రలను సేకరించారు. చిరుత సంచారం నిజమేనని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

చిన్నారిని చితకబాదిన వ్యక్తి

- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో ఓనమాలు రావడం లేదని ఓ వ్యక్తి చిన్నారిని చితకబాదిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మామిడిపల్లి చెందిన ఓ మహిళ తన భర్త చనిపోవడంతో బిడ్డను తీసుకొని ఓ వ్యక్తితో సహజీవనం కొనసాగిస్తుంది. మహిళ బిడ్డ అంగన్‌వాడీ కేంద్రానికి వెళుతున్నా ఓనమాలు రావడం లేదు. దీంతో నాలుగురోజుల క్రితం సహజీవనం చేస్తున్న వ్యక్తి చిన్నారి శరీరంపై వాతలు పెట్టి చితకబాదాడు. విషయం తెలుసుకున్న చిన్నారి మేనత్త,మేనమాలు గురువారం స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేయించారు. సమాచారం అందుకున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి చేరుకొని తల్లిని పిలిపించి విచారించారు. చిన్నారిని పోషించడానికి తల్లి విముఖత తెలపడంతో మేనత్త, మేనమామ వారింటికి తీసుకువెళ్లారు. ఈ విషయమై ఐసీడీఎస్ అధికారులు మాట్లాడుతూ.. చిన్నారిని త్వరలో జిల్లాకేంద్రానికి తరలించి, పోషణ విషయమై కుటుంబసభ్యులతో చర్చిస్తామన్నారు. చిన్నారి బాధ్యతను ఎవరూ తీసుకోకుంటే, ఐసీడీఎస్ తీసుకుంటుంద న్నారు.